7

సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025

కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న చికెన్ షాప్‌లు



మటన్ షాపు వద్ద బారులు తీరిన జనం



నో చికెన్.. ఓన్లీ మటన్!

ఆదివారం వచ్చిందంటే చికెన్, మటన్ షాపులు కళకళలాడుతుంటాయి. అయితే ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ భయం నేపథ్యంలో చికెన్ షాపులు బోసిపోయి దర్శనమిస్తున్నాయి. ధర తగ్గుముఖం పట్టినా కొనేందుకు జనం ఆసక్తి చూపడం లేదు. మరోవైపు మటన్ షాపుల వద్ద మాత్రం బారులు తీరుతున్నారు. – కైలాస్‌నగర్

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కరీంనగర్–మెదక్–ఆదిలాబాద్–నిజామాబాద్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి ప్రచార సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవుడు వేరు, రాజకీయం వేరని అన్నారు. బీజేపీ.. దేవుడిపై, కులమతాలపై రాజకీయం చేస్తుందన్నారు. మోదీ బీసీ కాదన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు కొందరు బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ కులమేంటని అడుగుతున్నారన్నారు. దేశ కోసం సర్వం త్యాగం చేసిన మోతీలాల్ నెహ్రూ కుటుంబం నుంచి వచ్చిన నాయకుడు రాహుల్‌గాంధీ అని గుర్తు చేశారు. పట్టభద్రులంతా నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్సీఅభ్యర్థి నరేందర్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ మల్లేశ్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీధర్, ఆత్రం సుగుణ, పార్లమెంట్ కోఆర్డినేటర్ నరేశ్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే సక్కు, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ఆనంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ బాబాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. టూటౌన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నకిలీ బాబాల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా నమ్మించి మోసం చేసే ప్రయత్నం చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు.

గొంతెండుడేనా..?

ఏజెన్సీలో తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. గొంతు తడవాలంటే ఆ ఊరిలో ఎవరైనా ఎడ్లబండి కట్టాల్సిందే. నిద్ర లేవగానే కిలోమీటర్ దూరంలో ఉన్న బోరు బావి వద్దకు వెళ్లాల్సిందే. అక్కడ గంటల తరబడి నిరీక్షించాల్సిందే. వేకువజాము నుంచే గ్రామస్తులు ఆ ఊరి పొలిమేర బాట పడుతారు. కిలోమీటర్ దూరంలో ఉన్న బోరు బావి వద్దకు వంతుల వారీగా చేరుకుంటారు. దాదాపు రెండు గంటల పాటు వేచి ఉండి ఇలా ఎడ్లబండ్లపై నీటిని తెచ్చుకుంటారు. ఆ ఊరే ఇంద్రవెల్లి మండలం తేజాపూర్ పంచాయతీ పరిధిలోని సాలెగూడ. గ్రామానికి మిషన్ భగీరథ పైపులైన్ ఉన్నా నీరందని పరిస్థితి. అలాగే ఉన్న రెండు చేతిపంపులు సైతం భూగర్భ జలాలు అడుగంటి మూలన పడ్డాయి. దీంతో తాగునీటి ఇక్కట్లు వర్ణనాతీతంగా మారాయి. ఈ ఒక్క గ్రామమే కాదు.. జిల్లాలో చాలా పంచాయతీల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి.



ఎడ్లబండిపై వెళ్లి డ్రమ్ముల్లో నీటిని తీసుకువస్తున్న మడవి ప్రభు

జిల్లాలో తాగునీటి సరఫరా వివరాలు

చేతిపంపులు	:3,316
విద్యుత్ మోటార్లు	:2,284
చేద బావులు	: 681
ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు	:1,529
మొత్తం నల్లా కనెక్షన్లు	: 1,43,480
పైపులైన్ కనెక్షన్లు	: 2037.35 కిలోమీటర్లు



పిప్పల్‌దరిలో తాగునీటి వనరులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

- పంచాయతీలకే తాగునీటి పథకాల పర్యవేక్షణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మాత్రం విడుదల కాని నిధులు
- ఇప్పటికే ఏజెన్సీల్లో మొదలైన నీటి ఎద్దడి
- ఎండలు పెరిగే కొద్ది తీవ్రమయ్యే అవకాశం
- సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై దృష్టి సారించని యంత్రాంగం



సాలెగూడలో పనిచేయని చేతిపంపు, పక్కనే ఎడ్లబండి ద్వారా డ్రమ్ముల్లో తెచ్చుకున్న నీరు

కైలాస్‌నగర్/ఇంద్రవెల్లి: మార్చి ఇంకా రానే లేదు.. అప్పుడే భానుడి ప్రతాపం మొదలైంది. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మ రోవైపు భూగర్భజలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. ఎండలు ముదిరే కొద్ది జిల్లాలో నీటి సమ స్య తీవ్రమయ్యేలా కనిపిస్తోంది. ప్రజల దాహార్తి తీర్చేలా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన యంత్రాంగం ఇప్పటి వరకు ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించనట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 3 నుంచి 12వరకు అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. నీటి ఎద్దడి తలెత్తే ఆవాసాలు, మరమ్మతులకు గురైన నీటి వనరులను గుర్తించారు. అయితే వాటిని బాగు చేసేందుకు పంచాయతీల్లో నిధులు లేకపోవడం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు విడుదల చేస్తే తప్ప నీటి సమస్య తీరదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జీపీల్లో నిధుల కటకట..

ప్రజలకు అవసరమైన తాగునీటిని ప్రస్తుతం మిషన్ భగీరథ పథకం ద్వారా అందజేస్తున్నారు. అయితే సరఫరాలో అంతరాయంఏర్పడితే స్థానికంగా ఉన్న నీటి వనరుల ద్వారా అందించాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలదే. చెడిపోయిన పైపులైన్లు, చేతి పంపులు, వాటర్ ట్యాంక్‌లు, విద్యుత్ మోటార్ల మరమ్మతులను వేసవి రాకముందే చేపట్టా ల్సి ఉంటుంది. అయితే ఏడాదిగా జీపీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కా వడం కాలేదు. దీంతో ఆయా పనులు చేపట్టడం పంచాయతీలకు భారంగా మారుతోంది. అత్యవసర పరిస్థితుల్లో కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు ప డాల్సి వస్తోంది. విధి లేని పరిస్థితుల్లో తమ జే బుల్లోంచి చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్లతో ఇటీవల నిర్వహించిన సమీక్షలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. దీంతో ఈ నెల 3నుంచి 12వరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. నీటి ఎద్దడి తలెత్తే ఆవాసాలు, వేసవిలో సమస్యాత్మకంగా మారే నీటి వనరులను గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 208 చేతిపంపులు ఉపయోగంలో లేనట్లు నిర్ధారించారు. ఎండలు ముదిరే కొద్ది మరో 327 చేతిపంపుల్లో నీరు రాని పరిస్థితి తలెత్తే అవకాశమున్నట్లుగా తేల్చారు. అలాగే సింగిల్ ఫేజ్ విద్యుత్ మోటార్లు 45 పనికిరాకుండా పోగా, సీజనల్‌గా 113 మోటార్లకు ఇబ్బందులు తలెత్తే అవకాశమున్నట్లుగా గుర్తించారు. ఇక త్రీఫేజ్ విద్యుత్ మోటార్ల పరంగా ఏడు పనిచేయని పరిస్థితిలో ఉండగా ఐదు సమస్యాత్మకంగా మారే అవకాశమున్నట్లుగా గుర్తించి అధికారులకు నివేదించారు. వీటితో పాటు జిల్లాలోని 88 చేదబావులు ఎండల తీవ్రతతో అడుగంటిపోయే పరిస్థితి ఉందని గుర్తించారు.

గతేడాది నిధులే విడుదల కాలే...

గతేడాది వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేలా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. నీటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించి ఎస్‌డీఎఫ్ కేటాయిస్తున్నట్లుగా ప్రకటించింది. దీంతో సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి నివేదిక అందజేశారు. వాటికనుగుణంగా ఆయా గ్రామాలకు నిధులను మంజూరు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈక్రమంలో జిల్లాలోని పలు గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి వనరుల మరమ్మతులు చేపట్టారు. చేదబావులు, బోరుబావులు ఎండిపోయినట్లయితే ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేశారు. స్థానిక వనరులకు ప్రత్యేక పైపులైన్లు కూడా వేశారు. కొత్తగా బోర్లు సైతం వేయించారు. విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించారు. జిల్లా వ్యాప్తంగా రూ.3.65 కోట్ల వ్యయంతో 614 పనులు చేశారు. ఇందులో రూ.1.50 కోట్లతో కూడిన బిల్లులను ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఏడాది గడిచినా ఇంకా విడుదల కాలేదు. దీంతో ప్రస్తుతం పనులు చేయాలంటే అధికారులు వెనుకడుగు వేస్తున్నారు.

పంచాయతీలదే బాధ్యత..

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీలదే. చేతి పంపులు, విద్యుత్ మోటార్లు, బోరుబావుల మరమ్మతులు చేపట్టి ప్రజలకు నీటి సమస్య రాకుండా వారే చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఆర్‌డబ్ల్యూఎస్ పరంగా ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. గతేడాది చేసిన పనులకే ఇంకా బిల్లులు విడుదల చేయలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల 10 రోజుల పాటు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నీటి ఎద్దడి తలెత్తే గ్రామాలను గుర్తించాం.
– చంద్రమోహన్, ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్

తోడేస్తున్నారు..




బేల మండలంలోని కంగార్‌పూర్ శివారులో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టగా జైనథ్, బేల ఎస్సైలు శనివారం రాత్రి తనిఖీలు చేపట్టారు. నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. మరోసారి ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్‌లో అక్రమార్కులు బోట్‌లో ఆయిల్ ఇంజిన్ ఏర్పాటు చేసి నదిలో ఉన్న ఇసుకను ఒడ్డుకు చేర్చుతున్నారు. పైపులైన్ ద్వారా ఇసుకతో పాటు నీరు ఒడ్డున పడుతుంది. జల్లెడ ద్వారా వేరయిన ఇసుకను ట్రాక్టర్ యజమానులకు విక్రయిస్తారు. అయితే ఏడు నెలల క్రితం పోలీసులు దాడులు నిర్వహించి బోట్‌తో పాటు అయిల్ ఇంజిన్‌ను సీజ్ చేశారు. అయినా అక్రమార్కుల తీరులో మార్పు రాకపోవడం గమనార్హం. తాజాగా మళ్లీ ఇసుక అక్రమ తవ్వకాలు జోరందుకున్నాయి. రాత్రి వేళల్లో ఈ దందా సాగుతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు తనిఖీలు చేసినప్పుడు స్తబ్దుగా ఉండి ఆ తర్వాత వారి పని కానిచ్చేస్తున్నారు.

- పెన్‌గంగలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- రాత్రి వేళల్లో జోరుగా అక్రమ రవాణా
- పట్టించుకోని మైనింగ్ అధికారులు
- రంగంలోకి దిగిన పోలీసు శాఖ



పెన్‌గంగలోని ఇసుకను పైపులైన్‌ద్వారా ఒడ్డుకు చేర్చుతున్నారిలా (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మహారాష్ట్రకు సరిహద్దున ఉన్న పెన్‌గంగ నదిలో కొందరు అక్రమ తవ్వకాలు చేపట్టి ఇసుకను తోడేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు. మైనింగ్ అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తుండడంతో వీరి దందా 'మూడు టిప్పర్లు.. ఆరు ట్రాక్టర్లు' అన్న చందంగా మారిందనే విమర్శలున్నాయి. ఇక పోలీసు, రెవెన్యూ అధికారులు తనిఖీలకు వెళ్తున్నారంటే వారికి ముందుగానే సమాచారం అందుతుంది. అధికారులు అక్కడికి చేరుకున్నాక అసలు అక్కడ తవ్వకాలే జరగనట్లుగా ఉంటుంది. ఈ దందా రాత్రి వేళల్లో జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వ ఆదేశాలతో పోలీసు అధికారులు రంగంలోకి దిగారు. అక్రమార్కులపై కొరడా ఝుళిపించేందుకు సమాయత్తమయ్యారు. ఇటీవల జైనథ్, బేల, భీంపూర్, తాంసి మండలాల పరిధిలో ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు.

నది పరీవాహక ప్రాంతాల్లో..

పెన్‌గంగ నది పరీవాహక ప్రాంతాలైన జైనథ్, భీంపూర్, బేల మండలాల్లోని తాంసి(కె), వడూర్, అంతర్‌గావ్, ఆనంద్‌పూర్, పెండల్‌వాడ, డొల్లార, సాంగ్వి, కొట, పూసాయి, పిప్పర్‌వాడ, కామాయి, కంగార్‌పూర్, సాంగిడి, బెదోడతో పాటు తదితర గ్రామాల్లో ఇసుక అక్రమ దందా సాగుతోంది. వానాకాలం ముందు వరకు పెన్‌గంగ నుంచి తోడిన ఇసుకను అనుకూలంగా ఉన్న చోట్ల కుప్పలుగా నిల్వ ఉంచుతున్నారు. వర్షాలు ముగిసిన తర్వాత సెప్టెంబర్ నుంచి తిరిగి నది పరీవాహక ప్రాంతాల్లోని ఇసుకను భారీ యంత్రాలతో తోడేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని వీడీసీలు, గ్రామ పెద్దల ద్వారా వేలం నిర్వహించి ఎవరో ఒకరు టెండర్ దక్కించుకుంటారు. ఆ తర్వాత టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక మైనింగ్ అధికారులు నామమాత్ర తనిఖీలకే పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టుకున్న వాహనాలకు జరిమానా విధించడం తప్పా అక్రమ దందాకు అడ్డుకట్ట వేయలేకపోవడం గమనార్హం. జిల్లాలో మైనింగ్ అధికారితో పాటు ఓ టెక్నికల్ అధికారి ఉన్నారు. మైనింగ్ అధికారికి నిర్మల్ జిల్లా అదనపు బాధ్యతలు ఉండడంతో ఆయన ఇటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక టెక్నికల్ అధికారి ని మరో జిల్లాకు డిప్యూటేషన్ ఇవ్వడంతో పది రో జులుగా అందుబాటులో లేకుండా పోయారు. ఉన్న అధికారి సైతం కార్యాలయంలో ఉండకపోవడం, ఎవరైన సమాచారం అందించేందుకు ఫోన్ చేసినా స్పందించపోవడం ఈ అక్రమార్కులకు కలిసి వస్తోంది.

దొడ్డిదారిన వేలం..

జిల్లాలో ఇసుక పాలసీ లేకపోవడంతో ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం సమకూరే పరిస్థితి లేకుండా పోయింది. గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ)లు దొడ్డి దారిన వేలం నిర్వహిస్తున్నాయి. స్థానిక అవసరాల కోసం ఇసుకను ఉపయోగిస్తామని తెలుపుతూ ఈ వేలం ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఏడాదికి రూ.అరకోటి పైగా ఆదాయం సమకూరుతుంది. గతేడాది బేల మండలం కాంగార్‌పూర్‌లో ఇసుక తవ్వకాల కోసం ఓ కాంట్రాక్టర్ రూ.62 లక్షలు, సాంగిడిలో రూ.30లక్షలు, ఆనంద్‌పూర్‌లో రూ.22 లక్షలు అందించినట్లు సమాచారం. జల్లెడ పట్టిన ఇసుక ట్రాక్టర్‌కు రూ.1500 వరకు, అలాగే కొన్ని వీడీసీలు రూ.300 నుంచి రూ.500 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్ యజమానులు ఆ ఇసుకను ఆదిలాబాద్ పట్టణంలో రూ.4వేల వరకు విక్రయిస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

జిల్లా సరిహద్దున ఉన్న పెన్‌గంగ నది సుమారు 70 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉంది. బేల, భీంపూర్, జైనథ్ మండలాల పరిధిలోని పరీవాహక ప్రాంతాల్లో అక్రమార్కులు పొక్లెయిన్లు, ఇతర యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. ఈ తవ్వకాలతో ఎక్కడబడితే అక్కడ లోతైన గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోయే పరిస్థితి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజు అక్రమార్కులు వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండల కేంద్రాలు, మహారాష్ట్రకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అక్రమార్కులపై నిఘా..

జిల్లాలోని బేల,భీంపూర్, తాంసి, తలమడుగు, జైనథ్ మండలాల్లో అక్రమంగా ఇసుక, మొరం తవ్వకాలు జరుపుతున్న వారిపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌తో పాటు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం

అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఇసుక, మొరం తవ్వకాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. బేల, జైనథ్, భీంపూర్ మండలాల్లోని నది పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టకుండా చర్యలు చేపడుతున్నాం. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. మొదటిసారి జరిమానా విధించి వదిలిపెడుతున్నాం. పునరావృతమైతే కేసులు నమోదు చేస్తాం. సీజ్ చేసిన ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగిస్తున్నాం.
– ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

దర్జాగా.. 'అక్రమ'ం

- అనుమతి లేకుండా భవన నిర్మాణం
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న అధికారులు



అనుమతి లేకుండా చేపడుతున్న భవన నిర్మాణం

కైలాస్‌నగర్: 'ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఆక్రమణలతో పాటు అక్రమాలు సైతం సహించం.. టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం..' ఇది మూడు రోజుల క్రితం కలెక్టర్ రాజర్షి షా అధికారికంగా చేసిన ప్రకటన. ఆక్రమణలతో పాటు అక్రమాలకు క్లెం వేయాల్సిన బల్దియా అధికారులు సాక్షాత్తు మున్సిపల్ కార్యాలయాన్ని ఆనుకునే అనుమతి లేకుండా భవన ని ర్మాణం చేపడుతున్నా చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో ఏకంగా రూ.50లక్షల డీల్ కుదిరినట్లుగా సమాచారం. అధికార పార్టీకి చెందిన ఓ మాజీ కౌన్సిలర్ ఇందులో చక్రం తిప్పినట్లు తెలుస్తోంది.

అనుమతి లేకుండానే పనులు

ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఓంకార్‌మాల్ జిన్నింగ్ ఏరియాలో సదరు వ్యాపారి కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. మున్సిపల్ అనుమతుల్లేకుండానే దర్జాగా పనులు చేపడుతున్నారు. మొదటి అంతస్తు పనులు ఇప్పటికే పూర్తికాగా రెండో అంతస్తుకు సంబంధించి సెంట్రింగ్ పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలోని ఎలాంటి ప్రాంతంలోనైనా భవన నిర్మాణం చేపట్టాలంటే మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకపోవడం గమనార్హం.

భారీ డీల్..

పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతానికి భారీ డిమాండ్ ఉంది. ఇక్కడ నిర్మించే మడిగెలు పూర్తికాకముందే అద్దెకు పోనున్నాయి. ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయం సమకూరనుంది. దీనిని గుర్తించిన సదరు వ్యాపారి బల్దియా అధికారులు సహకరించేలా చూడాలని సదరు వార్డు మాజీ కౌన్సిలర్‌ను వేడుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో సదరు వ్యాపారికి అభయమిచ్చిన ఆ మాజీ ప్రజాప్రతినిధితో పాటు బల్దియాలో అనుమతులు ఇచ్చే అధికారులందరికీ కలిపి సుమారు రూ.50లక్షల వరకు ముట్టజెప్పినట్లు సమాచారం. ఫలితంగానే అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నోటీసులు జారీ చేశాం..

పట్టణంలోని భుక్తాపూర్ శివారు రాణీసతీజీ కాలనీలో చేపట్టిన వాణిజ్యపరమైన భవన నిర్మాణానికి మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతుల్లేవు. అక్రమంగా సాగుతున్న నిర్మాణాన్ని నిలిపివేయాలని యజమానికి నోటీసులు జారీ చేశాం. నిర్మాణ పనులు సైతం నిలిపివేశాం. అక్రమంగా పనులు చేపట్టినట్లైతే చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటాం.
– సీవీఎస్.రాజు, మున్సిపల్ కమిషనర్

పంటలకు రక్షణ.. పక్షులకు ప్రాణాంతకం





పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన వలలో చిక్కుకుని చనిపోయిన చిలుకలు, గుడ్లగూబ

పంట రక్షణ చర్యలు పక్షుల పాలిట ప్రాణాంతకంగా మారుతున్నాయి. ఇంద్రవెల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఈ సీజన్‌లో రైతులు జొన్న, మొక్కజొన్న, గోదుమ పంటలు సాగు చేశారు. పంట రక్షణ కోసం ఇలా వలలు అమర్చడంతో నిత్యం వందలాది పక్షులు వాటిలో చిక్కుకుని చనిపోతున్నాయి. రామచిలుకలు, గద్దలు, గుడ్లగూబలతో పాటు అరుదైన పక్షులు సైతం తనువు చాలిస్తున్నాయి. దృష్టి సారించాల్సిన అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని పక్షి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. – ఇంద్రవెల్లి

రాష్ట్రస్థాయి పోటీలు విజయవంతం చేయాలి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న ఖేలో ఇండియా ఉషూ రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతం చేయాలని జిల్లా గిరిజన క్రీడ ల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఈ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అమెచ్యూర్ ఉషూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఉమర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజ్మీరా గణేశ్, వేముల సతీశ్, సంఘం ఆర్గనైజింగ్ చైర్మన్ అన్నారపు వీరేశ్, శృతి, సాయికుమార్, హ్యాండ్ బాల్ సెక్రెటరీ హరిచరణ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, శివప్రసాద్, శివకుమార్, ప్రణయ్ కుమార్, మాధవి, వనిత, దివ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్థసారథి, తదితరులు

క్లుప్తంగా

సిమెంట్ ఇటుకతో కొట్టి..

- భార్యను హత్య చేసిన భర్త
- లక్సెట్టిపేటలో ఘటన


రాజకుమారి (ఫైల్)

లక్సెట్టిపేట: సిమెంట్ ఇటుకతో కొట్టి భార్యను హత్య చేసిన ఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. గోదావరి రోడ్డు వికార్స్ కాలనీకి చెందిన లాకవత్ రాజకుమారి (40), గణేశ్ భార్యభర్తలు. భర్త తాగుడుకు బానిసై ఎలాంటి పనులు చేయకుండా తిరుగుతూ ఉండేవాడు. నిత్యం మద్యం తాగి వచ్చి భార్యకు వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో వేధించసాగాడు. ఆదివారం ఉదయం రాజకుమారి బాత్రూమ్‌కు వెళ్లగా, వెనుకాల వెళ్లి సిమెంట్ ఇటుకతో ఆమె తలపై కొట్టడంతో తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తల్లి రేణుకబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కారు బోల్తా: ఒకరి మృతి


బోల్తాపడ్డ కారు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమరవాది హైవేపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లికి చెందిన సింగరేణి ఉద్యోగి పూదరి ఓంకార్(32) మరో ఇద్దరు రాము, సంజయ్‌లు కారులో మందమర్రి వైపు వస్తున్నారు. అమరవాది హైవేపై కారు అదుపు తప్పి హైవే రైలింగ్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో ఓంకార్ అక్కడికక్కడే మృతిచెందగా రాము, సంజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇల్లు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బట్వాన్‌పల్లిలో ఇడిగిరాల భీమయ్యకు చెందిన పెంకుటిల్లు ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. రెండు తులాల బంగారం, రూ.80 వేల నగదుతోపాటు భీమయ్య కుమారుడు మహేశ్‌కు సంబంధించిన విద్యా అర్హత ధ్రువీకరణపత్రాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న బెల్లంపల్లి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కూలీ పనిచేసుకునే తనకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితుడు భీమయ్య కోరాడు.


జాతరలో ఆదివాసీల నృత్యం


మొక్కులు చెల్లించేందుకు బారులు తీరిన భక్తులు


మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ముగిసిన మైసమ్మ జాతర

- చివరిరోజు జనసంద్రంగా గాంధారి ఖిల్లా
- తరలివచ్చిన ఆదివాసీలు
- దర్బార్‌లో పాల్గొన్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి


మైసమ్మకు పూలదండతో అలంకరణ


భైరవుడి విగ్రహం వద్ద మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట గాంధారీ ఖిల్లా వద్ద మూడురోజులుగా నిర్వహిస్తున్న మైసమ్మ జాతర ఆదివారం ముగిసింది. ఆదివాసీ నాయక్‌పోడ్‌లు అధికసంఖ్యలో తరలివచ్చి మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివాసీలు సంప్రదాయ తప్పెటగూళ్ల ఆటలు, డప్పుచప్పుళ్లతో చేరుకుని అక్కడ గిరిజనులు తీసుకువచ్చిన గంగాజలంతో దేవతామూర్తులను శుద్ధి చేసి పట్నాలు వేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కోళ్లు, మేకలు బలిచ్చారు. ఆదివాసీలు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి ఆదివాసీలు, భక్తులు తరలిరావడంతో గాంధారీ ఖిల్లా ప్రాంతమంతా జనసంద్రంగా మారింది.

ఆదివాసీలకు ప్రత్యేక భవనం: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

ఆదివాసీల కోసం ప్రత్యేక భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం నిర్వహించిన దర్బార్‌కు ఆయన హాజరై మాట్లాడారు. భవనం ఏర్పాటుకు రెండు మూడు స్థలాలను పరిశీలించాలని నాయక్‌పోడ్ సంఘ నాయకులకు సూచించారు. భవనం కోసం స్థలంతోపాటు రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తానన్నారు. గాంధారి ఖిల్లాను మరింతగా అభివృద్ధి చేయాలంటే అటవీశాఖ అనుమతులు తప్పనిసరని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కుల కోసం సంఘం నాయకులంతా ఓ కమిటీగా ఏర్పడి వస్తే సీఎంను కలిసి తద్వారా ఆదివాసీల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో వందలాది కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో జాతర వేదిక వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంప్రదాయ నృత్యాలు, తప్పెటగూళ్ల ఆటలు, లక్ష్మీదేవర నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్యాతనపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, నాయక్‌పోడ్ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సేవాలాల్


హాజరైన మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

- రాష్ట్ర మంత్రి సీతక్క


పాల్గొన్న బంజారా సేవాలాల్ భక్తులు

బాసర: సంత్ సేవాలాల్ మహరాజ్ ఆదర్శప్రాయుడని, ఆయన అడుగుజాడల్లో నడవాలని రాష్ట్రమంత్రి సీతక్క పేర్కొన్నారు. బాసరలోని గోదావరి నది ఒడ్డున శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం 286వ సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి పొరగాడ్ పీఠాధిపతి బాబుసింగ్ మహరాజ్, దీక్షగురు ప్రేమ్‌సింగ్ మహరాజ్, ఎంపీ నగేశ్, ముథోల్, నిర్మల్, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు రామారావు పటేల్, మహేశ్వరరెడ్డి, వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బంజారా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బాసరలో సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని తెలిపారు. లంబడా, బంజారా నాయకుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం తరఫున సేవాలాల్ సంస్థాన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. బంజారాల కోసం బాసరలో ఐదెకరాల భూమి కేటాయించే వరకు పోరాడతానని ఎమ్మెల్యే రామారావుపటేల్ తెలిపారు. బాసరలో సేవాలాల్ మహరాజ్ మందిరం నిర్మిస్తామన్నారు. 15 వేల మందికి అన్నదానం చేసిన ఎమ్మెల్యేకు సేవాలాల్ సంస్థాన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ హిందూధర్మం గొప్పతనాన్ని బంజారాలకు తెలియజేసిన మహోన్నత వ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. అనంతరం బంజారా నాట్యమండలి, పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బాసరలో భక్తుల కిటకిట


క్యూలైన్‌లో భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బాసర: బాసర ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలువులు రావడంతో అధికసంఖ్యలో తరలివచ్చారు. మాఘశుద్ధ సంకట చతుర్థి శుభముహూర్తం సందర్భంగా జిల్లా నుంచే కాక ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చి పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతీ, మహంకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు అర్చకులతో అక్షర శ్రీకారం పూజలు చేయించారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

- ఒకరు మృతి


చుక్కయ్య (ఫైల్)

రెబ్బెన: రాంగ్‌రూట్‌లో వచ్చి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టిన ఘటన మండలంలోని నవేగాం బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై డి.చంద్రశేఖర్ కథ నం ప్రకారం.. మండలంలోని గంగాపూర్‌కు చెంది న నగోషా చుక్కయ్య (37), భార్య మాధవితో కలి సి ఆదివారం బైక్‌పై కాగజ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలోని నవేగాం బస్టాండ్ దాటగా రాళ్లపేటకు చెందిన కుక్కల ల క్ష్మణ్ ఎదురుగా రాంగ్‌రూట్‌లో బైక్ నడుపుకుంటూ వచ్చి చుక్కయ్య బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చుక్కయ్యకు తీవ్రంగా, మాధవి గాయాలయ్యా యి. చుక్కయ్యకు రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకోగా వీరి బంధువు శ్రీకాంత్ వెంటనే 108కు సమాచారం అందించాడు. సిబ్బంది అక్కడికి చేరుకుని ఇద్దరిని కాగజ్‌నగర్‌కు తరలించారు. చుక్కయ్యను వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదుతో లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి


మల్లేశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ సమీపంలో జాతీయ రహదారి 44పై బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై కె.మహేందర్, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా కలాంబి గ్రామానికి చెందిన నివారే జ్ఞానేశ్వర్ (56) గత కొంతకాలంగా బోథ్‌లోని ఓ ప్రైవేటు జిన్నింగ్ మిల్లులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆదివారం తన స్వగ్రామమైన కలాంబి గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. శర్మదాబా సమీపంలో వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం అతివేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై సుమలత తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని మల్లాపూర్‌కు చెందిన రేణి మల్లేశ్ (56) శనివారం రాత్రి పని నిమిత్తం బైక్‌పై లక్ష్మణచాందకు వెళ్లి తిరుగుపయనమయ్యాడు. ఈక్రమంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్ రోడ్డు పక్కనే ఉన్న పంట పొలంలో పడి మృతిచెందాడు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుమలత ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరేసుకుని టీచర్ ఆత్మహత్య


సంతోష్ నాయక్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన టీచర్ సంతోష్‌నాయక్ (28) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. సంతోష్‌నాయక్ జైనూర్ మండలం జామ్నిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు పని నిమిత్తం నిర్మల్‌కు వెళ్లారు. ఇంట్లో ఆయన సోదరి ఉన్నారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో సోదరి ఆయన్ను నిద్ర నుంచి లేపే ప్రయత్నం చేయగా మేల్కొలేదు. దీంతో ఆమె వెంటనే ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు చెప్పింది. వారు మధ్యాహ్నం వచ్చి చూసేసరికి ఉరేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బేల: మండలంలోని కాంపూర్‌పూర్ రెవెన్యూ గ్రామశివారులోని పెనగంగ నుంచి ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ తెలిపారు. సమాచారం మేరకు పెన్‌గంగ శివారులో ఏఎస్సైలు లింగన్న, జీవన్‌కుమార్ తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

పిచ్చికుక్కదాడిలో ఒకరికి గాయాలు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఆరేవాడలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మానేపల్లి సత్యనారాయణ..విందు కార్యక్రమానికి వెళ్లి తిరిగివస్తుండగా పిచ్చికుక్క దాడిలో కుడి కాలికి గాయమైంది. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నాడు.


పెయింటెడ్ స్టార్క్స్ పక్షులు



బాతుజాతి పక్షులు

అరుదైన పక్షులకు ఆలవాలం

కాగజ్‌నగర్ డివిజనల్ అరుదైన పక్షులకు ఆలవాలంగా మారింది. ఇక్కడ ఎన్నో జాతులు మనుగడ సాగిస్తున్నాయి. గతనెలలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఇక్కడ బర్డ్‌వాక్ ఫెస్టివల్ విజయవంతంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన పక్షి ప్రేమికులు సిర్పూర్(టి), బెజ్జూర్, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ రేంజ్‌ల్లో పర్యటించారు. అటవీప్రాంతంలో స్వేచ్ఛగా సంచరిస్తున్న అందమైన పక్షులను గుర్తించి తమ కెమెరాల్లో బంధించారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 240 వరకు పక్షి జాతులు ఉన్నాయని సిర్పూర్(టి) రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు.

– సిర్పూర్(టి)


అరుదైన పక్షి


కాగజ్‌నగర్ డివిజన్‌లో అరుదైన పక్షులు


స్మాల్ ఇండియన్ ప్యాంటికోల్స్


బ్రాహ్మిణి డక్స్


బార్‌హెడెడ్ గూస్ పక్షులు

బెల్లంపల్లి డివిజన్‌లోనే బెబ్బులి

- తాండూర్–బెల్లంపల్లి మధ్య సంచారం
- కదలికలను పర్యవేక్షిస్తున్న అటవీ అధికారులు
- ఆందోళన చెందుతున్న గ్రామీణ ప్రజలు


అచ్చులాపూర్ అటవీ ప్రాంతంలో గుర్తించిన పులి పాదముద్రలు

బెల్లంపల్లి: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి బెల్లంపల్లి డివిజన్‌లోకి వచ్చిన బెబ్బులు.. పక్షం రోజులుగా ఇక్కడే మకాం వేసింది. బెల్లంపల్లి, తాండూర్ మండలాల పరిధిలోనే రోజుకో గ్రామంలో దాని పాదముద్రలు కనిపిస్తున్నాయి. దీంతో ఇటు అటవీ అధికారులకు, అటు అటవీ గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. అటవీ అధికారులు నిత్యం పులి కదలికలను పర్యవేక్షిస్తున్నారు. పులికి ఆపద రాకుండా చూసుకుంటున్నారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి అటవీ ప్రాంతం నుంచి జిల్లాలోకి వచ్చిన పులి బెల్లంపల్లి మండలం కన్నాల అటవీ ప్రాంతం, కాసిపేట మండలంలోని అటవీ ప్రాంతాల్లో సంచరిస్తోంది. ఓ అడవి పందిపైదాడి చేసింది. తర్వాత తాండూర్ మండలం అంకుశం, మాదారం, రేపల్లెవాడ అటవీ ప్రాంతాల మీదుగా రెబ్బెన మండలం పులిమడుగు అటవీ ప్రాంతాల్లో సంచరించింది. తర్వాత తక్కళ్లపల్లి గ్రామశివారు అటవీ ప్రాంతం నుంచి తాండూర్ మండలం గోపాల్‌నగర్ శివారులో ప్రత్యక్షమైంది. అక్కడ ఉన్న ఓ మంచినీళ్ల బావివద్ద గ్రామీణులు పులి అడుగులను చూసి ఆందోళన చెందారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించడంతో తక్షణమే స్పందించిన వారు సంరక్షణ చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం పులి పాదముద్రలను అచ్చులాపూర్ గ్రామం ప్రజలకు కనిపించాయి. గ్రామం నుంచి సమీపంలో ఉన్న అడవిలోకి వెళ్లినట్లు అటవీ అధికారులు గుర్తించారు. బెల్లంపల్లి మండలం చర్లపల్లి గ్రామ పరిసరాల్లో పాద ముద్రలు కనిపించాయి. పులి కదలికలను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది చర్లపల్లి గ్రామంలో పర్యటించారు. పాదముద్రల ఆధారంగా పులి సంచారాన్ని ధ్రువీకరించారు. అచ్చులాపూర్, గోపాల్‌నగర్, చంద్రవెల్లి, చర్లపల్లి తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాని సూచించారు. ఒంటరిగా అటవీ ప్రాంతానికి వెళ్లొద్దని తెలిపారు. పులికి ఆపద తలపెట్టొద్దని పేర్కొన్నారు.

మూడు దశాబ్దాల తర్వాత..


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 1993–96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత ఒకచోట కలిసిన వీరు ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కళాశాలలో చదివి ఉన్నత శ్రేణిలో స్థిరపడిన బోయ తిరుపతి (జిల్లా జడ్జి), కె.వేణుగోపాలస్వామి (డీఎంఎస్), కరీముల్లాఖాన్ (సాఫ్ట్‌వేర్ కంపెనీ డెలివరీ మేనేజర్), శ్రీరామ్ (డెల్ కంపెనీ మేనేజర్)ను సన్మానించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా కప్పి సత్కరించారు. ఒక్కో బ్రాంచ్ పూర్వవిద్యార్థులు కళాశాల హాస్టల్ ముందు మొక్కను నాటారు. ప్రిన్సిపాల్ దేవేందర్, మైనింగ్, ఈఐ, ఈఈఈ బ్రాంచిల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.